



తెగుతున్న బంధాలు

భూ వివాదాలు, తగాదాలతో నిత్యం గొడవలు

- అన్నదమ్ములు, రక్తబంధికులు మధ్య కక్షలు, పగలు
- మాటలతో పోయేది.. చావుదాక
- అనుబంధాలపై తీవ్ర ప్రభావం
- ఏళ్ల తరబడి తిరుగుతున్న కుటుంబాలు
- ప్రశాంతంగా ఉండే పల్లెల్లో ఉద్రిక్తతలు

మహబూబాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉండే పల్లెల్లో భూ వివాదాలు.. భూ తగాదాలు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. అన్యోన్యంగా ఉండే అన్నదమ్ముల బంధాలు తెగిపోతున్నాయి. రక్తసంబంధీకుల మధ్య కక్షలు, పగలు పెరుగుతున్నాయి. అనుబంధాలను తెంచుకుంటూ.. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. పొలం, ఇళ్ల స్థలాల వద్ద గెట్లు, దారులు, తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే భూముల పంపకాల విషయాల్లో తరుచుగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. పంతాలు, పట్టింపులకు పోయి నోటిమాటతో తెగే పంచాయితీ కర్రలు, కత్తులతో దాడులు చేసేదాక తెచ్చుకుంటున్నారు. గ్రామాల్లో పంచాయతీ పెట్టి పరిష్కరించుకునే సమస్యలు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సినపరిస్థితులు దాపురించాయి. అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు, బావబామ్మార్దుల మధ్య వరుసగా ఈ తగాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏళ్లకేళ్లకు పోలీసస్టేషన్, కోర్టుల చూట్టు తిరుగుతున్న కుటుంబాలు కోకొల్లలు, ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో అత్యధికంగా భూ తగాదాల ఫిర్యాదులే ఉండడం గమనార్హం.

వివాదాలకు కొన్ని కారణాలు..

గతంలో కంటే భూములకు విపరీతంగా ధరలు పెరగడం, అమ్మిన వాటినే మళ్లీ అమ్మడం, అప్పుడు తక్కువ ధరకు విక్రయించాం. మళ్లీ మాకు డబ్బులు కావాలని అమ్మినవారు తిరగబడడం, తాతలు, తండ్రుల నాటి భూముల పంపకాల్లో హెచ్చుతగ్గులు ఉండడం లాంటి వాటి వలన గొడవలు మరింత పెరిగిపోతున్నాయి. వానాకాలం సాగుకు సిద్ధమయ్యే సమయం.. దుక్కులుదున్ని విత్తనాలు వేసే సమయం కావడంతో పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. ట్రాక్టర్లతో దున్నడం, సరిహద్దు రాళ్లు చెరిపివేయడం లాంటివి గొడవలకు కారణమవుతున్నాయి.

ఠాణాల్లో పెరుగుతున్న ఫిర్యాదులు..

పోలీస్‌స్టేషన్‌లో భూ తగాదాల గొడవలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొన్ని పోలీస్‌స్టేషన్‌లలో అధికారులు ఇరువురిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. కొన్నిచోట్ల పోలీస్‌స్టేషన్‌లలో పంచాయతీలు తెగడం లేదు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని కేసులపాలవుతున్నారు. ఒక్కొక్క పోలీస్‌స్టేషన్‌లో రోజుకు 8 నుంచి 14 మధ్య భూతగాదాల కేసులు రావడం గమనార్హం. అయితే ఇరువర్గాల వారు కక్ష్యలు, పగలు పెంచుకోకుండా రాజీ కుదుర్చేలా పోలీసులు ప్రయత్నం చేయాల్సి ఉంది. కానీ, కొందరు పోలీసులు లంచాలకు అల వాటుపడి ఒకేవర్గం వైపు వత్తాసు పలకడంలో గొడవలు మరింత పెరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- బయ్యారం మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న, మోహన్ అనే అన్నదమ్ముల నడుమ ఇంటి పంపకం విషయంలో ఆదివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సమస్య పరిష్కారం కోసం గ్రామానికి చెందిన పలు వురు జోక్యం చేసుకున్నప్పటికి ఫలితం లేకపోయింది. విషయం గ్రామస్తులకు తెలిసిందని అవమానకరంగా బావించాడో.. లేకమరే ఇతర కారణమో తెలియదు కానీ వెంకన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.
- జనగామ జిల్లా చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కుంచం కార్యవర్ధి రాజు-జ్ఞానేశ్వరి 2011లో అదే గ్రామానికి చెందిన పసునూరి నరేందర్‌రెడ్డి దగ్గర రెం డెకరాల భూమిని కొనుగోలు చేశారు. పహాణీలో సైతం పేరు నమోదు చేసుకు న్నారు. కానీ, అమ్మిన వ్యక్తి ఇప్పటి వరకు పట్టా చేయలేదు. ఎన్నిసార్లు అడి గిన పట్టించుకోలేదు. ఈ క్రమంలో తిరిగి అదే భూమిని 2015లో అతని సమీప బం ధువైన ఇంద్రాసేనరెడ్డికి విక్రయించి అతడికి పట్టా చేశాడు. ఈ విషయమై బాధిత రైతు కార్యవర్ధి రాజు దంపతులు ఊరి పెద్దమనుషులతో పాటు పోలీసులను ఆశ్రయించారు. ఐనా సమస్య పరిష్కారం కాకపోవడంతో జ్ఞానేశ్వరి ఆత్మహత్య చేసుకుంది.
- భూ తగాద విషయంలో తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేం దర్ హత్యకు గురైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బుర్హాన్‌పల్లిలో జరిగింది. ఓ స్థలం విషయంలో హతుడు నిందితుల మధ్య ఆరేండ్లుగా వివాదం జరుగుతుండగా అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మాజీ సర్పంచ్‌పై పెద్ద సుత్తేతో దాడి చేసి హతమార్చడం తీవ్ర కలకలం రేపింది.
- కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో కొత్తగా సరిహద్దు వివాదాలపై సుమారు 10 వరకు కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.
- వెంకటగిరి, పెనుగొండ, ధనసరి గ్రామాల్లో భూ గెట్ల పంచాయతీల్లో ఐదు చొప్పున కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.
- ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్లాట్ల ఖాళీ స్థలాల్లోని హద్దులపై ఐదు ఫిర్యాదులు కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాయి.
- నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో నలుగురు రైతులు భూ తగాదాల, రిజిస్ట్రేషన్‌ల విషయంలో పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.
- రాజులకొత్తపల్లి గ్రామంలో ఆరుగురు రైతులు భూముల కొనుగోలు విషయంలో ఫిర్యాదులు చేశారు.
- బ్రహ్మణకొత్తపల్లిలో ముగ్గురు రైతులు గెట్ల పంచాయతీ విషయంలో నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.
- వస్రంతండాలో ముగ్గురు రైతులు భూములు ఎక్కువగా.. తక్కువగా ఉన్నాయని, వాటిని సరిచేసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

> ఏదీ ఏమైనా ఆర్థికపరమైన అంశాల్లో మానవ సంబంధాలు మంట కలవడం ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న క్రమంలో కౌన్సిలింగ్‌ల ద్వార ఇలాంటి సంఘటనలో చోటు చేసుకోకుండ సామరస్యంగా పరిష్కరించుకునే దిశగా స్వచ్ఛంద సేవ సంస్థలు,పోలీసులు, న్యాయవాదులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. కుటుంబసభ్యులంతా కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం కానీ సమస్యలంటూ ఏమి ఉండవని పేర్కొనడంలో అతిశయోక్తి లేదు. పంతాలకు పోయి.. ఆత్మహత్య లకు, హత్యలకు పాల్పడకుండా వివాదాలకు సంబంధించిన విషయాల్లో పోలీసులే ఇరువర్గాలను కూర్చోబెట్టి కౌన్సిలింగ్ నిర్వహించి తద్వారీ వారిలో మార్పు తీసుకువచ్చేందుకు వారి ఆలోచనల్లో కూడ చైతన్యం తెచ్చే దిశగా కృషి చేయాల్సి ఉంది.

కూతురిని ప్రేమించాడని..

- వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం
- అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం
- సినిమా థియేటర్‌లో ఘటన
- భయకంపితులైన జనం

వివరాలు : 5 లో..

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్

ఎస్సెస్సీలో వందశాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రామారావు

మహబూబాబాద్ టౌన్, జూలై 12 : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సెస్సీ వార్షిక ఫలితాల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యేలా చూడాలన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌ను ధారాళంగా మాట్లాడే విధంగా తర్ఫీదు నివ్వాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారిని ప్రోత్సాహించాలన్నారు. వనహోత్సవంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బీసిరినాయక్, ఉపాధ్యాయులు కె.వాసుదేవ్, కె.భరత్‌వ్యాస్, ఈ.మాధవి, అశోకొరెడ్డి, లత, శోభ, జబర్‌లాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



మహబూబాబాద్ టౌన్, జూలై12 : మానుకోట పట్టణంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పట్టణంలో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ టౌన్-1 ఏఈ సంగీత, టౌన్-2 ఏఈ నవ్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాత, కొత్త బజారులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- తొర్రూరు : తొర్రూరు సబ్‌స్టేషన్ పరిధిలోని హరిపిరాల, తొర్రూరు సబ్ స్టేషన్‌లలో మెయింటెనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు తొర్రూరు పట్టణం, సోమ్లాతండా, చింతలపల్లి, హచ్చుతండా, కొమ్మనపల్లి తండా, హరిపిరాల, వెంకటాపురం, అమర్‌సింగ్ తండా, పెద్ద దుబ్బతండా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.
- గూడూరు : గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రణయ్ తెలిపారు. గూడూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
- మరిపెడ: మరిపెడ సబ్ డివిజన్ పరిధిలోని మరిపెడ, ఎడ్జెర్ల, ఎల్లంపేట సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మరిపెడ విద్యుత్ శాఖ ఏడీఈ లోకనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు ఉదయం 8నుంచి సాయంత్రం 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

మహబూబాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, గుట్కా అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల కాలంలో వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నారు. అందులో భాగంగానే శుక్రవారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలను చేపట్టారు. జిల్లా సరిహద్దులో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసి, పంపించారు. గంజాయి, గుట్కా అక్రమరవాణాకు అడ్డుకట్టవేసి జిల్లాలోని యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పోలీసులు నిఘా పెంచారు.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టలేదు

- గిరిజన యువకుడు మాలోతు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మాలోతు సురేష్‌బాబు

తొర్రూరు, జూలై 12 : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి పీఏ తీరుపై వాట్సప్‌లో పోస్టుపెట్టినందుకు పోలీసులు కేసుపెట్టి, కొట్టిన విషయంలో ఆమె న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గిరిజన యువకుడు మాలోతు సురేష్ తెలిపారు. శుక్రవారం తొర్రూరు మండంలోని వెలికట్టె శివారు ఈదులకుంట తండాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టలేదని, ఆమె పీఏ విజేందర్‌రెడ్డి వ్యవహారశైలిని నిరసిస్తూ మాత్రమే పోస్టు చేశానని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేసి, దురుసుగా వ్యవహరించారని, ఈ వ్యవహారం మీడియాలో వైరల్‌గా మారడంతో ఎమ్మెల్యే తనను పిలిచి మాట్లాడారన్నారు. ఎస్సై, పీఏ విజేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు తనను పావుగా మార్చే ప్రయత్నాలు జరిగాయని, ఎమ్మెల్యే హామీతో బయటపడ్డానన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గఅధ్యక్షుడు రాజేష్‌నాయక్, నాయకులు సురేష్, జాటోత్ రవి, శ్రీనివాస్‌నాయక్, అభిరాం, రమేష్, కిషన్, సమ్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 15 కుటుంబాలు చేరిక

బయ్యారం, జూలై 12 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 కుటుంబాల సభ్యులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్ పేర్కొన్నారు. బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేటకు చెందిన 15 కుటుంబాల సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం ఆగస్టు 15 నాటికి రుణమాఫీ ప్రక్రియ పూర్తి కానున్నట్లు పేర్కొన్నారు. విధివిధానాలు పూర్తి కాగానే అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా సురేష్, పుల్లయ్య, రాంబాబు, రవి, సతీష్, రాజు, వెంకన్న, రమేష్, సన్నీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనులు చేయాలి
- పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



కొత్తగూడలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి సీతక్క



దివ్యాంగురాలి నుంచి వనతి పత్రం తీసుకుంటున్న సీతక్క

కొత్తగూడ, జూలై 12 : ప్రజాసంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం అని, అధికారులు అంకితభావంతో ప్రజలకు అందుబాటులో ఉండి, సేవచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల పరిధిలో చేపట్టిన చేపట్టబోయే పనుల వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్లు, భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అయినా స్పందించకుంటే పనులను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు రెండుకు మించి పనులను కేటాయించవద్దన్నారు. రోడ్లను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో వైద్యం అందించాలన్నారు. కొత్తగూడ, గంగారం మండలాలు పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలు అని అన్నారు. అధికారులు ఈ మండలాలపై దృష్టి సారించి, అభివృద్ధి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాల భారీన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కాగా, ఎంపీడీవో కార్యాలయం అవరణంలో నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి సీతక్క, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ సుధీర్‌రామనాథన్ కేకన్ మొక్కలు నాటారు. కొత్తగూడ మండలంలోని పలు రోడ్ల పనులను ఆమె ప్రారంభించారు.

నెలకు రెండుసార్లు 'ప్రజాదర్బార్'

కొత్తగూడ, గంగారం మండలాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నెలలో రెండు సార్లు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు సీతక్క పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు.

జాతరను తలపించిన కార్యక్రమం..

మంత్రి సీతక్క దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు పలు మండలాల నుంచి వందలాదిగా తరలివచ్చిన ప్రజలతో రైతువేదిక ప్రాంతం జాతరను తలపించింది. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో బత్తుల విశాల్, ట్రాన్స్‌కో ఎస్ఈ నరేష్, ఆర్డీవో అలివేలు, జడ్పీటీసీలు పుల్సం పుష్పలత శ్రీనివాస్, రమ, సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేదోడుగా, పసిపాపను లాలించిన మహిళ కానిస్టేబుళ్లు



దివ్యాంగురాలిని తీసుకువస్తున్న మహిళ కానిస్టేబుళ్లు

తన సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లేందుకు ఓ దివ్యాంగురాలు ప్రజాదర్బార్ వద్దకు వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగురాలిని బయటి నుంచి వేదిక వద్దకు ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు సుమలత, సౌభాగ్య మోసుకువచ్చారు. మంత్రి సీతక్క, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వేదిక దిగి దివ్యాంగురాలి వద్దకు వచ్చి తన సమస్యను విన్నారు. సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన తరువాత దివ్యాంగురాలిని బయటికి మోసుకుని తీసుకువచ్చారు. ప్రజాదర్బార్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు ఓ మహిళ తన పసిపాపతో సహ వచ్చింది. పాప ఏడస్తూ ఉండటంతో మహిళ కానిస్టేబుల్ సుమలత గుర్తించి, తల్లి వచ్చేవరకు లాలించింది.

గృహజ్యోతిలో చేర్పులు మార్పులు : డీఈ




'ఆన్‌లైన్' నమోదును పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

తొర్రూరు, జూలై 12 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో కొందరు సాంకేతిక కారణాలతో అర్హులు కాలేకపోయారని, వారందరు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు విద్యుత్ డివిజన్ ఇంజనీర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మునిసిపాలిటీలో గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదు, తదితర వివరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ రేషన్ కార్డుకు అనుసంధానం చేసుకున్న యూఎస్‌సీ నంబర్, ఇల్లు మారినపుడు తప్పుగా నమోదు చేస్తే అలాంటి లబ్ధిదారులు గ్రామాలకు చెందిన వారు ఎంపీడీవో కార్యాలయంలో, మునిసిపాలిటీ పరిధిలో మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి ఎడిట్ ఆప్షన్ ఇచ్చామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తులో సవరణలకు అవకాశం

మహబూబాబాద్ టౌన్ : ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం (200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్) కింద ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి లబ్ధిచేకూరని వారు తిరిగి సవరణలు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని విద్యుత్ డీఈ పెరుమాళ్లపెల్లి విజయ్, ఏఏవో రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో సరిచేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారని, ఈ సదావకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత విద్యుత్ అమలై ఇళ్లు మారినప్పుడు రేషన్‌కార్డు, యూనిక్ సర్వీస్ నెంబర్ అనుసంధానం లోపాల వల్ల ప్రయోజనాలు పొందలేని వారు సవరించుకునేందుకు మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులను సరిచేసుకోవాలన్నారు.



ఆటోలను దొంగలించిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

బాలసముద్రం, జూలై 12: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హంటర్‌రోడ్డులోని పద్మాక్షీ గుట్ట ఏరియా ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆటోలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని శుక్రవారం అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం, మట్కాక్టివ్ జిల్లా, ఉప్పల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన రమేష్ పట్నాయక్(40), అతడి స్నేహితుడైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన వేములు సంతోష్(42)లు జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలకు అలవాటుపడి పార్కింగ్ చేసిన ఆటోలను దొంగిలించడం వృత్తిగా ఎంచుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువ చేసే మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇద్దరు దొంగలను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.



ఇద్దరు వ్యక్తుల అరెస్టును చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

రాధక్క సంతాప సభను జయప్రదం చేయాలి

కాళోజీ జంక్షన్, జూలై 12: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క సంతాప సభను జయప్రదం చేయాల్సిందిగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కోరారు. సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు సమీపంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంతాపసభకు సంబంధించిన పోస్టర్లను హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో ఆవిష్కరించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్దన్, ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పార్టీ ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ మోకాళ్ల మురళీకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పాల్గొంటున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు తెలిపారు.



హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు











హనుమకొండలో ట్రాఫిక్ మళ్లింపు

హనుమకొండ కలెక్టరేట్, జూలై12: హనుమకొండలోని అశోకా జంక్షన్ నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులు నిర్వహించేందుకు వరంగల్ గ్రేటర్ మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ నెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం వరకు ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేస్తామని తెలిపారు. బస్‌స్టేషన్‌కు వెళ్లాలనుకున్న వాహనదారులు ఏషియన్ మాల్, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా నుంచి బాలాంజనేయ దేవాలయం మీదుగా చేరుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజేపీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 12: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబా ఫూలే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఆర్‌సీవో వై. మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను నేరుగా సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్(9866610429), ములుగు (9989991703), మహబూబాబాద్ (7093003078), పాలకుర్తి (9989418015), భూపాలపల్లి (9154102635) తదితర కళాశాలల్లో అర్హతలను బట్టి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.

రైల్వేల అభివృద్ధి నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

కాజీపేట, జూలై 12: కాజీపేటలో రైల్వే పరిశ్రమల అభివృద్ధి, రైల్వే కార్మికుల సంక్షేమంపై శనివారం కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ కడియం కావ్యతో పాటు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు హాజరుకానున్నారని చెప్పారు. సాయంత్రం 4గంటలు జరిగే ఈ సమావేశానికి రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, లోకో పైలెట్‌లు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఇతర సంఘాలు పాల్గొని రైల్వే సమస్యలపై చర్చించాలని రాఘవేందర్ కోరారు.

మక్కలకు రికార్డు ధర

క్వింటాకు రూ. 2,645

మట్టెవాడ, జూలై 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వరంగల్‌లో శుక్రవారం మొక్కజొన్నలకు రికార్డు ధర పలికింది. మొక్కజొన్నలకు క్వింటాల్‌కు రూ.2,645 ధర పలికింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట మొక్కజొన్నలు మార్కెట్‌లో రూ.2,400 ధర పలికింది. అది క్రమంగా పెరుగుతూ శుక్రవారం రూ. 2,645కు ఎగబాకింది.

కూతురిని ప్రేమించాడని..

వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం ● అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం ● సినిమా థియేటర్‌లో ఘటన


వర్ధన్నపేట థియేటర్‌లో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, జూలై 12 : భారతీయుడు - 2 సినిమా రిలీజ్ సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని భారతీయ టాకీస్‌లో సాయంత్రం 6 గంటలకు ఫస్ట్ షో పడింది. సినిమా ప్రారంభమై పది నిమిషాలు కాగానే ఒక్కసారిగా హాహాకారాలు వినిపించాయి. దీంతో థియేటర్‌లో ఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెనకకు చూస్తే కత్తితో ఓ యువకుడిని పొడుస్తున్న దృశ్యం. దీంతో అందరూ ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టారు. ఏం జరిగిందో తెలుసుకునే సరికి దాడిచేసిన వ్యక్తి కత్తిని అక్కడే వదిలేసి పారిపోయాడు. వర్ధన్నపేట పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని ఇల్లందలో శుక్రవారం కుటుంబసభ్యులు వన భోజనాలకు వెళ్లారు. అక్కడే భోజనాలు చేసి మద్యం సేవించి సాయంకాలం భారతీయుడు-2 సినిమా చూసేందుకు దాదాపు 8మంది వర్ధన్నపేటకు వచ్చారు. థియేటర్‌లో విజయ్ ముందు సీట్లో కూర్చోగా, కృష్ణ అతడి వెనకాలే కూర్చున్నాడు. అప్పటికే కృష్ణ తన వెంట తెచ్చుకున్న కత్తితో సినిమా పడిన 10నిమిషాలకు విజయ్‌ను వెనక నుంచి మూడుసార్లు పొడిచారు. అరుస్తూ వెనక్కి తిరగ్గా పొట్టలో మరోసారి పొడిచి, కత్తి అక్కడే పడేసి బయటకు వెళ్లిపోయాడు. దాడి సమయంలో అడ్డుపడిన కృష్ణ అక్క కుమారుడు గంధం రాజ్‌కుమార్‌కు సైతం కత్తి పోటు పడింది. విజయ్‌తో వచ్చిన వాళ్లు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ప్రేమ వ్యవహారమే కారణమా?

ఇల్లందకు చెందిన ఊర కృష్ణ ఓల్డ్ ఐరన్ (పాత ఇనుమ సామగ్రి) షాపు నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన సోదరుడు ఊర రాజ్ కుమార్ సైతం వర్ధన్నపేట పట్టణంలో ఓల్డ్ ఐరన్ షాపు వ్యాపారం చేస్తున్నాడు. రాజ్‌కుమార్ వద్ద మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అమ్మాపురంనకు చెందిన యువకుడు కల్లెం విజయ్ పనిలో చేరాడు. విజయ్ ఇల్లందలోనే ఉంటూ షాపును చూసుకుంటున్నాడు. కొన్ని నెలల కిందట కృష్ణ కూతురిని ప్రేమించిన విషయంలో విజయ్‌తో గొడవలు జరగగా, వారి సామాజిక వర్గంలో(బుడగ జంగాలు) పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నారు. విజయ్‌దే తప్పని తేల్చి అతడికి దాదాపు రూ.50వేల వరకు జరిమానా విధించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. విజయ్ కూడా తనపని తీను యథావిధిగా చేసుకుంటున్నాడు. కానీ తన కూతురుని ప్రేమించిన విషయాన్ని కృష్ణ మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో శుక్రవారం కృష్ణ కుటుంబంతో పాటు సోదరుడు రాజ్‌కుమార్ కుటుంబం కూడా వనభోజనానికి వచ్చింది. వారితోపాటే కల్లెం విజయ్ కూడా వచ్చాడు. సాయంత్రం అంతాకలిసి సినిమాకు ప్లాన్ చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన కృష్ణ.. వారితోపాటే సినిమాకు వస్తూ వెంట కత్తిని తెచ్చుకున్నాడు. థియేటర్‌లో విజయ్ వెనకాలే కూర్చొని కత్తితో దాడి చేశాడు.

సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడి జరిగిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో మొబైల్, దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వర్ధన్నపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. గాయాలైన కుటుంబసభ్యులు ఫిర్యాదు అందిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.


నిందితుడు కృష్ణ (ఫైల్)


బాధితుడు విజయ్ (ఫైల్)


చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్

నేటి నుంచి ప్యాసింజర్ ప్రారంభం

డోర్నకల్, జూలై 12: విజయవాడ - డోర్నకల్ - భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్ - డోర్నకల్ - విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే (07979/07278) ప్యాసింజర్ రైలును శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాష తెలిపారు. గతనెల 27న దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సమయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. దీంతో స్పందించిన డీఆర్ఎం రైలు పునరుద్ధరణకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మైనూపాషా రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్


నిందితుడు నాగరాజు (ఫైల్)

నర్సంపేట టౌన్, జూలై 12: ప్రేమించి పెళ్లి చేసుకుంటే అత్తమామలు భార్యను తనకు కాకుండా చేశారనే కక్షకట్టి అత్తమామలపై నిందితుడు నాగరాజు దాడి చేసి హత్య చేసినట్టు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేయగా, వరంగల్ డీసీపీ విలేకరుల సమావేశంలో ఘటన వివరాలను వెల్లడించారు.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీకి చెన్నారావుపేట మండలం 16 చింతల్‌తండాకు చెందిన బానోతు దీపిక స్కూల్‌కు వెళ్లే సందర్భంలో (ఐదేళ్ల కిందట) పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. 2023 అక్టోబరులో నాగరాజు, దీపికలు హైదరాబాద్‌కు వెళ్లి నవంబరులో జగదిగిరిగుట్ట వద్ద వివాహం చేసుకున్నారు. ఈ విషయంపై దీపిక తల్లిదండ్రులు హనుమకొండలోని సుబేదారిలో పోలీస్ స్టేషనలో అదేరోజు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు వారిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు దీపిక నాగరాజుతో పాటు వెళ్లింది. కొంతకాలం హైదరాబాద్‌లో ఉండగా, ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరగగా, నాగరాజుతో ఉండలేనని దీపిక తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అప్పటి నుంచి దీపిక పుట్టింట్లోనే ఉంటోంది. అయితే తన భార్యను తన వద్దకు రాకపోగా, ఆమె తల్లిదండ్రులు తమను వేరు చేస్తున్నారన్న కక్షను పెంచుకున్న నాగరాజు.. వారిని ఎలాగైనా చంపాలని భావించాడు. హైదరాబాద్ నుంచి 5నెలల కిందట గుండెంగకు చేరుకొని ఆటో కిరాయి తీసుకొని నడుపుకుంటున్నాడు. నెల కిందట నెక్కొండలో అంబేడ్కర్ సెంటర్ వద్ద కత్తులు అమ్ముతున్న వ్యక్తి వద్ద పదునైన పొడవాటి కత్తిని కొనుగోలు చేశాడు. 16 చింతల్‌తండాకు రెండు, మూడు పర్యాయాలు వెళ్లి దీపిక ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు.

ఈనెల 11న రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో నాగరాజు తన తాత వద్ద టీవీఎస్ ఎక్సెల్ వాహనం తీసుకొని 16 చింతల్‌తండాకు చేరుకున్నాడు. దీపిక ఇంటి వద్దకు చేరుకున్న నాగరాజు.. ఇంటి బయట రేకులషెడ్డు కింద రెండు మంచాలలో నిద్రపోతున్న దీపిక, దీపిక తల్లి బానోతు సుగుణ, తండ్రి శ్రీనులపై తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న దీపిక తమ్ముడు మదన్‌లాల్ మెడపై కత్తితో వేటు వేశాడు. ఈ దాడిలో సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చనిపోయాడు. భయంతో మదన్‌లాల్, దీపికలు పారిపోయారు. ఇంతలో చుట్టుపక్కలవారు రావడంతో నాగరాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయంపై మృతుడు శ్రీను తల్లి ఈరమ్మ చేసిన ఫిర్యాదుతో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీపై కేసు నమోదు చేశారు. ఈనెల 11న నెక్కొండ సీఐ సిబ్బందితో హనుమకొండలోని వడ్డెపల్లి జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌ను అందుబాటులో ఉంచాలి..



ఫోర్టిఫైడ్ రైస్ తయారీ విధానంపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల ప్రతినిధులు

కాళోజీ జంక్షన్, జూలై 12: ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ సంపూర్ణ పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోపాటు పౌర సరఫరాల శాఖలో సమన్వయ లోపం వల్ల నాసిరకం బియ్యం పంపిణీ జరుగుతోందని దామోదర్ అన్నారు. ప్రభుత్వ చౌక డిపోలు, ప్రభుత్వ బియ్యం గోదాముల ద్వారా వినియోగదారులకు ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా అవుతున్న క్రమంలో అవాంతరాల వల్ల ఆహార కల్తీ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆహార సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ నిరోధక శాఖ ఫోర్టిఫైడ్ రైస్ లైసెన్స్ జారీ వరకే పరిమితం కాకుండా నిరంతర నిఘా పెట్టాలని అన్నారు. సమావేశంలో ఫోర్టిఫైడ్ రైస్ తయారీపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇంకా నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమసమితి ప్రతినిధులు పెండోట అనిల్‌కుమార్, నందు ప్రవీణ్, గైనీ రత్నాకర్, వినియోగదారుల మండలి ప్రతినిధులు రావుల రంజిత్‌కుమార్, ఎర్ర అశోక్‌కుమార్, కల్యాణపు శ్యాంసుందర్ పాల్గొని మాట్లాడారు.

మంత్రి సురేఖను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

బాలసముద్రం, జూలై 12: రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ఆర్టీసీ ఆర్ఎం విజయభాను శుక్రవారం హనుమకొండలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్ బస్టాండ్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వరంగల్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కె.భానుకిరణ్, హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్‌లు ఉన్నారు.


మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందిజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

పీడీఎస్ బియ్యం, గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 12: పరకాల ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో రూ.8లక్షల 26వేల పీడీఎస్ బియ్యం, రూ.1లక్ష 58వేల గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం నిల్వలున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పరకాలలో దాడులు చేశారు. పోలీసుల దాడుల్లో బండి కుమార్ వద్ద రూ.2లక్షల 80వేల బియ్యం, బండి శంకర్ వద్ద రూ.2లక్షల 8వేల బియ్యం, టి.ఐలయ్య వద్ద రూ.3లక్షల 38వేల బియ్యంతోపాటు ఆర్.చంద్రశేఖర్ వద్ద రూ.1లక్ష 58వేల గుట్కాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం స్థానిక పోలీసులు నలుగురిని అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ నిస్సార్‌పాషా, ఏఎస్సై పీవీరావు, కానిస్టేబుళ్లు కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు


చెత్తలో ఉన్న అధికారుల చిత్రపటాలు

చాంబర్‌కు వాస్తు దోషం!

ఎంజీఎంలో అధికారుల ఆఫీసుల మార్పు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

చెత్త బుట్టలోకి పాత సూపరింటెండెంట్ల చిత్రపటాలు

వరంగల్ మెడికల్, జూలై 12: ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్‌కు వాస్తు దోషం పట్టుకుంది. దీంతో సూపరింటెండెంట్ పలు కార్యాలయాల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఏకంగా రూ.50లక్షల ప్రజాధనంతో నూతన హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకున్నారు. పాత చాంబర్ బాగానే ఉన్నప్పటికీ వాస్తు పేరుతో డెర్మటాలజీ విభాగంలో ఓపీ విభాగం మరో చోటికి మార్చి మరీ చాంబర్ ఏర్పరుచుకున్నారు. అదే విధంగా ఆర్ఎంవో గదులను కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో పరిపాలన కార్యాలయాన్ని మరోచోట, వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మరోచోట ఉండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే సెక్షన్లు ఒకచోట.. అధికారులు మరో చోట ఉండటంతో అధికారుల సంతకాల కోసం అక్కడిదాకా వెళ్లాల్సి వస్తోంది. ఎంజీఎంలో కనీస వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే.. ఉన్నతాధికారి మాత్రం ఇన్ని హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకోవడం అవసరమా..? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.

చెత్త కుప్పలో చిత్రపటాలు

ఎంజీఎం ఆస్పత్రిలో పాత సూపరింటెండెంట్‌లకు అవమానం జరిగింది. వారి చిత్రపటాలను చెత్తబుట్టలో పడేశారు. ఎంజీఎం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైద్యాధికారుల చిత్రపటాలను అలా పడేయడంపై సిబ్బంది, రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు పని చేసిన సూపరింటెండెంట్ల ఫొటోలను సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉంది. అయితే చాంబర్ ఆధునీకరణ పేరుతో ఈ ఫొటోలను అన్నింటినీ చెత్తబుట్టలో వేశారు. ఎవరు, ఎంతకాలం పనిచేశారనే బోర్డులను కూడా తొలగించారు. ఎంజీఎంకు అమూల్యమైన సేవలు అందించిన ఉన్నతాధికారుల ఫొటోల పట్ల నిర్లక్ష్యం తగదని ఆ శాఖ ఉద్యోగులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆ చిత్రపటాలను చాంబర్‌లో ఏర్పాటు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


హనుమకొండ చౌరస్తాలో ఏర్పడ్డ గుంతలు


వడ్డెపల్లి జంక్షన్ వద్ద 'వావ్ వరంగల్' లోగో ఎదుట ఏర్పడ్డ గుంతలు


హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద..

గుంతల దారులు.. నగరవాసుల అవస్థలు..


హనుమకొండ బస్‌స్టాండ్ వద్ద గుంతలు


కాజీపేట జంక్షన్‌లో అస్తవ్యస్తంగా..


ములుగురోడ్ జంక్షన్‌లో ఏర్పడ్డ గుంతలు

నగరం ఓ వైపు స్మార్ట్ సిటీగా అడుగులు వేస్తున్న సమయంలో నగర వాసులను గుంతలమయమైన రహదారులు అవస్థల పాలు చేస్తున్నాయి. వరంగల్ నుంచి కాజీపేట వరకు రోడ్లన్నీ అడుగుకో గుంతతో అధ్వానంగా, ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా జంక్షన్లలో ఏర్పడిన గుంతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అసలే గుంతల రోడ్లపై ప్రయాణంగా కష్టంగా ఉందనుకుంటుంటే.. వర్షాలకు వాటిలో నీరు నిలిచి ఎక్కడ ఏ గతుకు ఉందో అర్థం కాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తున్నామని చెబుతున్న పాలకులు, అధికారులకు తమ కష్టాలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గుమస్తాల సంఘం నూతన కమిటీ ఎన్నిక


సోమేశ్వర్, ప్రశాంత్‌రెడ్డి

కేసముద్రం, జూలై 12 : కేసముద్రం మార్కెట్ ఆవరణలో శుక్రవారం ఇఫ్టూ అనుబంధ గుమస్తాల సంఘం నూతన కమిటీని గౌరవ అధ్యక్షుడు ముత్యాల శివకుమార్, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు శివారపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా బొల్లు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొడకండ్ల ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆరెపు మధు, సిరికొండ శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా లెక్కల దేవేందర్‌రెడ్డి, బానోత్ హన్మ, కోశాధికారిగా ఆకారపు రవీంద్రాచారి, గౌరవ సలహాదారులుగా భైరు శ్రీనివాస్, మిర్యాల యాకయ్య, బొల్లు చంద్రయ్య, కూన సారయ్య, ముత్యాల స్వామిని ఎన్నుకున్నారు. గుమస్తాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

227.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 12 : జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. కొత్తగూడలో 10.6, బయ్యారంలో 5.8, గార్లలో 14.8, డోర్నకల్‌లో 17.0, కురవిలో 20.0, మహబూబాబాద్‌లో 1.8, కేసముద్రంలో 5.6, నెల్లికుదురులో 11.2, నర్సింహులపేటలో 23.2, చిన్నగూడూరులో 24.2, మరిపెడలో 38.6, దంతాలపల్లిలో 19.4, తొర్రూరులో 12.6, పెద్దవంగరలో 22.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెరసి 227.4 మిల్లీమీటర్ల వర్షపాతం పడగా జిల్లాలో సగటున 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి'

నెల్లికుదురు, జూలై 12 : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త మాదరి ప్రశాంత్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మహబూబాబాద్, హన్మకొండ హైదరాబాద్‌కు వెళ్ల వలసిన పరిస్థితి నెలకొందన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లలేక విద్యార్థులు చదవు మానేస్తున్నా రన్నారు. నెల్లికుదురు జూనియర్ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు.

రవిచంద్రను కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు


రాజ్యసభ సభ్యుడు రవిచంద్రతో మున్నూరుకాపు సంఘం నాయకులు

కేసముద్రం, జూలై 12 : రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్‌లో శుక్రవారం కేసముద్రం మున్నూరుకాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చందా గోపి, సింగంశెట్టి యాకాంతం (చంటి), కముటం శ్రీనివాస్, బనిశెట్టి వెంకటేష్, మామిడి శోభన్, అశోక్‌లు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, జూలై 12 : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి 20 వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేయాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను కేసముద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, సూరయ్య, లింగాల పిచ్చయ్య, అశోక్, విజేందర్, శ్రవణ్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యను పరిష్కరించాలి'


మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మట్టేవాడ కాంగ్రెస్ నాయకులు

గూడూరు, జూలై 12 : మండలంలోని మట్టేవాడ శివారు దొరవారితిమ్మాపురం, నెలవంచ, కొంగరిగిద్దా గ్రామాలల్లోని పోడు భూముల్లో విద్యుత్ లైన్ మరమ్మతు పనులు నిర్వహించాలని మంత్రి ధనసరి సీతక్కకు కొత్తగూడలో మట్టేవాడ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసం వీరస్వామి, మాజీ ఎంపీపీ రేగ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూతి రమేష్, మూతి పాపారావు, పెనక అశోక్, పెనక మహేందర్ పాల్గొన్నారు.

'పెండింగ్ ఉపకార వేతనాలను విడుదల చేయాలి'


కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

మహబూబాబాద్ టౌన్, జూలై12 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. సదరు డిమాండ్‌తో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, నినాదాలు చేశారు. తొలుత స్థానిక వివేకానంద సెంటర్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు విద్యార్థులతో భారీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేలకోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని మంజూరు చేయాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేయాలన్నారు. రాష్ట్రంలో 596 మండలాలకు ఎంఈవోలు లేక ఇన్‌చార్జి పాలన కొనసాగుతోందని, దీంతో పర్యవేక్షణ కొరవడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. 'మన ఊరు -మనబడి' కింద పాఠశాలలకు మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమశాఖలో అక్రమంగా కొనసాగుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సర్కార్ కృషి చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ సభ్యులు గుగులోతు సూర్యప్రకాశ్, గంధసిరి జ్యోతి, బానోత్ సింహాద్రి, వీరేందర్, గుండ్ల రాకేష్, కల్యాణ్, వంశీ, సంజు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● వైద్యాధికారి యమున

గూడూరు, జూలై 12 : ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారిణి డాక్టర్ యమున అన్నారు. గూడూరు మండలం భూపతిపేట శివారు కారంపొడి తండాలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారంపొడి తండాలో మొత్తం 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నలుగురు రక్తనమూనాలు సేకరించినట్లు చెప్పారు. జ్వరంపై ఇంటింటా సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, డాక్టర్ దేవేందర్, సిబ్బంది విశాల, సర్దార్‌బాబు, లాలు, నరేందర్‌రెడ్డి, స్రవంతి, రజిత పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి సెమినార్


రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ చీనానాయక్, మరియన్న, మాలతి, భాస్కర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 12 : శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త అధిపతి ఆధ్వర్యంలో రెండ్రోజుల స్థాయి సెమినార్ ముగిసింది. మహబూబాబాద్ ఐఎంఏ హాల్లో ఈ ఉద్యాన సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చీనానాయక్ మాట్లాడారు. ఉద్యాన యూనివర్సిటీ తరుపున భవిష్యత్ కార్యక్రమాల్లో మరిన్ని సెమినార్‌లు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ పసుపులో మేలైన వంగడాలు ఎంపిక చేసుకునే విధానం ఎత్తు మడుల పద్ధతిపై వివరించారు. హైదరాబాద్ ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ లావణ్య ధనియాలు, మెంతుల సాగులో మెళకువలను గురించి వివరించారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జె.మరియన్న మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులు సహకరించాలని కోరారు. ఈ సెమినార్‌లో పాల్గొన్న రైతులకు కూరగాయల విత్తనాలు, ఉద్యాన దర్శిని పుస్తకాలు, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే మల్యాల సమన్వయకర్త మాలతి, ఉద్యానపరిశోధన స్థానం అధిపతి కె.భాస్కర్, రాష్ట్ర అభ్యుదయ రైతు సొల్లెటి జయపాల్‌రెడ్డి, తొర్రూరు ఉద్యాన అధికారి రాకేష్, అక్షిత, భావన, జిల్లాలోని రైతులు పాల్గొన్నారు.

57 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగి పీజీ పూర్తి

● నలంద పీజీ స్టడీ సెంటర్‌లో కనకయ్యకు సర్టిఫికెట్ ప్రదానం


ఎంఏ తెలుగు పూర్తి చేసిన కోల కనకయ్యకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, జూలై 12 : చదువుకు వయసుతో నిమిత్తంలేదని నిరూపించారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి వయసులో ఉన్నత చదువు ఎంఏ పూర్తిచేసి, పట్టాను అందుకున్నారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన 57 సంవత్సరాల వయసు ఉన్న కోల కనకయ్య విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో స్థానిక నలంద డిగ్రీ కళాశాలలోని కాకయతీయయూనివర్సిటీదూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) స్టడీ సెంటర్‌లో విద్యుత్ ఉద్యోగి కనకయ్య 2022లో ఏంఏ. తెలుగులో అడ్మిషన్ పొందారు. రెండేళ్ల చదివి 2024లో జరిగిన ఫైనల్ ఫలితాల్లో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. మహబూబాబాద్ నలంద కళాశాలలోని కేయూ పీజీ స్టడి సెంటర్‌లో కనకయ్యకు ఎంఏ. తెలుగు ఉత్తీర్ణత మెమోను శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వై.కృష్ణప్రసాద్ అందజేసి 57ఏళ్ల వయసులో కూడా దృఢసంకల్పంతో చదివి పీజీ పట్టా అందుకుని చదువుకు వయసుతో సంబంధలేదని నిరూపించిన కనకయ్యను పలువురు అభినందిస్తున్నారు. అందరు విద్యలో కనకయ్యను ఆదర్శంగా తీసుకోవాలని డోలి సత్యనారాయణ తెలిపారు.

ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి

గూడూరు, జూలై 12 : ప్రతీ ఉద్యోగస్తుడికి పదవీవిరమణ తప్పదని, విధుల్లో ఉన్నప్పుడు చేసిన సేవలు మంచి గుర్తింపును తీసుకువస్తాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. గూడూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన సంగెపు స్వామి శుక్రవారం పదవీవిరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ విద్యారంగంలో సంగెపు స్వామి సేవలు అభినందనీయమన్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఊకె లక్ష్మయ్య, మండల వెంకన్న, కోటేశ్వర్, గోపినాథ్, చీర బిక్షపతి, రామోజీనాయక్ పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ ఆర్థిక సహాయం

కేసముద్రం, జూలై 12 : కేసముద్రం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవనం పైనుంచి పడిన పవిత్ర వైద్యచికిత్స కోసం ఆమె కుటుంబానికి పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.46,100లను ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థినికి రెండు చేతులకు తీవ్ర గాయాలై ఖమ్మం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విషయం విధితమే. ఈ క్రమంలో తల్లిదండ్రులు విరాళాలు సేకరించి ఈ సహాయాన్ని అందించినట్లు పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొట్టు రమేష్ తెలిపారు. కమిటీ బాధ్యులు బానోత్ రవి, ధరంసోత్ బాలు, లాల్‌సింగ్, బాలు పాల్గొన్నారు.

కిషన్‌నాయక్‌కు ఘన సన్మానం

మహబూబాబాద్ టౌన్, జూలై 12 : మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ మాల జర్నలిస్టు అసోసియేషన్ (టీఎంజేఏ) ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమకారుడు, తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుగులోతు కిషన్‌నాయక్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎంజేఏ జిల్లా అధ్యక్షుడు చందా శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజానికి సామాజిక ఉద్యమకారుడు కిషన్‌నాయక్ ఎంతో ఆదర్శనీయమని, నేటి తరం యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుడు కిషన్‌నాయక్ తన సేవలను మరింత విస్తృత పర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు అశోక్, యాకాంతం, వెంకన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థికి సన్మానం

కేసముద్రం, జూలై12 : కల్వల జడ్పీహైస్కూల్లో శుక్రవారం బాసర ట్రిబుల్ ఐటీ సీటు సాధించిన కోయగూర హరిణిని హెచ్ఎం బండారు నరేందర్, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఉపాధ్యాయులు రూ.5116, ఏఏసీ చైర్మన్ గంట పుష్పలత రూ.1016, లింగాల పిచ్చయ్య రూ.1500 విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మండలంలో ఒకేఒక్క సీటు తమపాఠశాల విద్యార్థిని ట్రిబుల్ ఐటీ సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు దేవేందర్, కవిత, ఉపాధ్యాయులు ఆర్.ఏకాంబ్రం, తండ సదానందం, బి.సత్యనారాయణ, ఎం.యాకాంబ్రం, ఆర్.భిక్షపతి, వి.రాజేంద్రచారి, బి.బాలశౌరెడ్డి పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వ్యక్తి నిరసన


బురద రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ముక్తార్ అహ్మద్

మరిపెడ, జూలై 12 : మునిసిపల్ కేంద్రం పూలబజార్లోని ఓ గల్లీ బురద రోడ్డుపై కూర్చొని అదే కాలనీకి చెందిన మహమ్మద్ ముక్తార్ అహ్మద్ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా తమ కాలనీ రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని, పలుమార్లు మునిసిపల్ అధికారులకు తెలిపినా గింత పట్టింపులేదన్నారు. వృద్ధులు, పిల్లలు బురద రోడ్డుపై నడిచే పరిస్థితి లేదన్నారు. గత రెండ్రోజుల క్రితం ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్‌కు, జిల్లా అధికారులకు సైతం వాట్సప్ ద్వారా తెలియజేశానన్నారు. దీంతో బురదరోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయాలని వేడుకున్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి


మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సునంద

● షీటీం ఎస్సై సునంద

మహబూబాబాద్ టౌన్, జూలై 12 : మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలం అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, షీటీం విధులు, మానవ అక్రమరవాణా, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ .అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని , ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళలు, విద్యార్థునుల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ, వాటిని విక్రయించిన పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాలహెచ్ఎం డానియల్, ఉపాధ్యాయుడు దుర్గయ్య, షీటీం ఏఎస్సై ఆనందం, రమేష్, సుప్రజ, జయశ్రీ పాల్గొన్నారు.

సీడీపీవోకు ధర్నా నోటీస్

మరిపెడ, జూలై12 : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక సంఘ బాధ్యులతో కలిసి ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమస్యల సాధన కోసం ఆందోళనకు దిగుతున్నామని మరిపెడ సీడీపీవో శిరీషకు ధర్నా నోటీసు ఇచ్చారు. జ్యోతి, ఉమారాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర, జూలై 12 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అనపురం శ్రీనివాస్ తండ్రి సోమేంద్రి(70) ఇటీవల మరణించడంతో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తొర్రూరు మునిసిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళిగౌడ్, ముత్తినేని శ్రీనివాస్, బానోతు వెంకన్న, వేణు, ఉపేందర్, హరిక్రిష్ణ, వినోద్, జలాల్‌వోద్దీన్ పాల్గొన్నారు.

'దివ్యాంగులకు పెన్షన్లు పెంచాలి'

తొర్రూరు, జూలై 12 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు పెన్షన్లు పెంచుతానని హామీ ఇచ్చారని, హామీ మేరకు పెన్షన్‌లు పెంచాలని కోరుతూ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడు తూ ప్రభుత్వం దివ్యాంగుల కోసం పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచడం జరుగుతుందని హామీ ఇచ్చారని, హామీ మేరకు పెన్షన్లు పెంచాలన్నారు. సంఘం నాయకులు పి.శంకర్, టి.అశోక్, ఎన్.వెంకన్న, ఎల్లయ్య, ఇబ్రహీం, సందీప్ ఉన్నారు.

రాంచంద్రునాయక్‌తోనే అభివృద్ధి

దంతాలపల్లి, జూలై 12 : ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌తోనే డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని దాట్ల తాజా మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ అన్నారు. శుక్రవారం ఆయన దాట్లలో కార్యకర్తలతో మాట్లాడుతూ సీఎంరేవంత్‌రెడ్డి సారధ్యంలో రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో దంతాలపల్లి మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందనుందన్నారు. ఈ సందర్భంగా కొమ్మినేని రవీందర్ జన్మదిన సందర్భంగా కార్యకర్తలు భారీగా చేరుకొని కేక్‌కట్ చేశారు. మాజీ సర్పంచులు కొత్త కొమురెల్లి పద్మ, గండి వెంకటనారాయణగౌడ్, నాయకులు సురేష్, తాజా మాజీ ఉపసర్పంచ్ యాకన్న, జాహంగీర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న అధికారులు


'ప్రజలకు మరింత సేవలు అందించాలి'

తొర్రూరు, జూలై 12 : ప్రజా ప్రతినిధులు రాజకీయాల్లో ఉన్నప్పుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మాజీ ఎంపీపీ టీసీ అంజయ్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల పదవీ కాలం ముగిసిన తాజామాజీ ఎంపీటీసీలకు, అంజయ్యను ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు శాలువా మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఐబీ డీఈ యుగందర్, ఎంపీవో గౌస్, తాజా మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, వివిధ గ్రామాల తాజా మాజీ ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుడు మృతి

దంతాలపల్లి, జూలై 12 : మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గునిగంటి లింగయ్య(50) గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కరుణాకర్ శుక్రవారం మాట్లాడుతూ గురువారం గ్రామశివారులో తాటి కల్లు గీసేందుకు చెట్టు ఎక్కేక్రమంలో ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలయ్యాయన్నారు. లింగయ్యను వెంటనే ప్రైవేటు వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్య చికిత్స కోసం తరలించారు. ఈ క్రమంలో లింగయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు లింగయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ పేర్కొన్నారు.

'ప్రజాసంక్షేమమే లక్ష్యం'


మాట్లాడుతున్న సీపీఐ నేత నల్లు సుధాకర్‌రెడ్డి

చిన్నగూడూరు, జూలై12 : ప్రజా సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుండం రాజుపల్లిలో సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరలు, రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన పట్టించుకోని ప్రభుత్వాలపై ప్రజా పోరాటం చేయడమే మార్గమని అన్నారు. మండల కార్యదర్శి గంజి శేషాద్రి, దొంతు స్టాలిన్, పోలేపాక వెంకన్న పాల్గొన్నారు.

సంతాప సభ పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం, జూలై 12 : వరంగల్ జిల్లా కేంద్రంలో ఈనెల 14న జరిగే గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నేత రాధక్క సంతాప సభకు సంబంధించిన పోస్టర్లను బయ్యారంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగాపార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడారు. భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రతిఘటనా పోరాటానికి ప్రాధాన్యత ఉందన్నారు. సంతాప సభ పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు బిక్షం, పద్మ, వీరభద్రం, నాగేశ్వరరావు, రాకేష్, బుచ్చ య్య, యుగేందర్, మహేశ్, మురళి పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరిస్తాం'

డోర్నకల్, జూలై 12 : వినియోగదారులు కరెంట్ సరఫరా, ఇతర సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువస్తే, వెంటనే వాటిని పరిష్కరిస్తామని టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యుత్ అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డోర్నకల్, కురవి, గార్ల, బయ్యారం, సీరోలుతో పాటు మరిపెడ మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 12 మంది తమ సమస్యలను అధికారుల వద్ద ప్రస్తావించారని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అధికారులు రమేష్, కిరణ్, నరేందర్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు బోధన చేయాలి'

డోర్నకల్, జూలై 12 : ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలని ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారి పూల్‌సింగ్ అన్నారు. శుక్రవారం డోర్నకకలో బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవమైన వృత్తిఅని, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దుతారని అన్నారు. ఉపాధ్యాయులు వెంకట్రావు, ప్రభుదాస్, విద్యాసాగర్, సీతారాములు పాల్గొన్నారు.

క్రికెట్ కప్ విజేత కొత్తగూడ

కొత్తగూడ, జూలై 12 : యాదవ సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో నిర్వహిస్తున్న యాదవ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలో కొత్తగూడ మండలం జట్టు మొదటి బహుమతి సాధించి కప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు గద్ద అశోక్, మాజీ మండల అధ్యక్షుడు తోటకూరి మధు, టీం సభ్యులు లెంకలపల్లి శ్రీను, ననుబోతుల లింగన్న, రాజు, శ్రీశైలం, సాంబలింగ, త్యాగరాజు, వీరన్న, రాజు, రామ్, రాకేష్, నరేష్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో మాక్ పోలింగ్

కురవి, జూలై 12 : విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్కూల్ పూపిల్ లీడర్ (ఎస్పీఎల్) ఎన్నికలు నిర్వహించారు. అచ్చం ఎన్నికల్లో ఏ విధంగానయితే ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తారో.. అదే విధంగా ఇద్దరు విద్యార్థులను పోటీ చేయించి పోలింగ్ నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులో ఓట్లను లెక్కించి గెలుపొందిన విద్యార్థిపేరు ప్రకటించారు. సోషల్ ఉపాధ్యాయులు జె.గోవర్ధన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. హెచ్‌డబ్ల్యూవో బి.పద్మ, హెచ్ఎం డీసీ ఎస్.శర్మ, ఉపాధ్యాయులు బి.వెంకన్న, భద్రు, అనిల్ కుమార్, రవి, కరంచంద్, బాలరాజు, శ్రీను, ధర్మ, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

కొత్తగూడ, జూలై 12 : విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలపాలైన సంఘటన వేలుబెల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. వేలుబెల్లికి కొంపెల్లి లింగన్న విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు సరిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయాలపాలైన లింగన్నను స్థానికులు 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి
దరఖాస్తు చేసుకోవాలి

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు

మహబూబాబాద్ టౌన్, జూలై 12 : ఇటీవల మంజూరైన కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 16లోపు దరఖాస్తులు చేసుకోవాలని మహబూబాబాద్ నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డి. రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, అర్థశాస్త్రం, కామర్స్, కెమెస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50శాతం ఉత్తీర్ణత ఉంటే చాలని చెప్పారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16లోగా మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబంధిత జిరాక్స్ సర్టిఫికేట్‌లను జతచేసి దరఖాస్తులను అందించాలని చెప్పారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని ఆయన పేర్కొన్నారు.